## కాలమ్ దాటని కథ

''ఈరోజు నేను కాస్త ఆలస్యంగా వస్తాను'' భార్యతో చెప్పాడు రాఘవరావు ఆఫీసుకెళ్తూ.

ఆఫీసుకెళ్ళి ఆ రోజు తన కొచ్చిన వుత్తరాలు ఏమైనా వున్నాయేమో చూసుకుని తన సీట్లో కూర్చున్నాడు.

ఎప్పుడు ఐదవుతుందా అని ఎదురు చూస్తున్న రాఘవరావుకు రెండు రోజుల క్రితం జరిగిన సంగతి గుర్తుకొచ్చింది.

అతని కొలీగ్ దూరపు చుట్టం పెళ్ళి సంబంధాలు వెతుక్కుంటూ రాఘవరావు దగ్గరకొచ్చి మాటలు కలిపాడు. తన కూతురు అందం, ఆమె గుణాలు చెప్తుంటే రాఘవరావు తనకు పెళ్ళికాలేదని, తను మరునాడు వాళ్ళింటికి వస్తానని ఆ ముసలాయనకు మాటిచ్చాడు.

రాఘవరావు నిజంగా పెళ్ళి చూపులకు వెళ్ళాలనుకున్నది కేవలం సరదాకే. పైగా అక్కడ చేసే మర్యాదలు, ఇచ్చే టిఫిన్‌లు, ఆపై పరాయి ఆడపిల్లతో కాసేపు మాట్లాడుకోవచ్చు. రాఘవరావు తన సంగతి బయట పడుతుందేమోనని ఆ సమయంలో ఆలోచించలేదు. ఈ విషయం తన భార్యకు తెలియదులే అని అతడు అనుకున్నాడు.

సరిగ్గా ఐదు గంటలకు అందరికంటే ముందు ఆఫీసు బయటకు వచ్చాడు రాఘవరావు.

### పాపం పెళ్ళి కొడుకు!

ఆ ముసిలాయన ఇచ్చిన అడ్రసు వెతుక్కుంటూ ఆ యింటికి చేరుకునేసరికి అరగంట పట్టింది.

వీధిలో అతని కోసమే చూస్తున్న పెళ్ళి కూతురు తండ్రి రాఘవరావుకు ఎదురువెళ్ళి స్వాగతం చెప్పాడు. రాఘవరావు హుందాగా నడుచుకుని వాళ్ళయింటి ముందు హాల్లో కూర్చున్నాడు. మర్యాదలు, టిఫిన్‌లు అయ్యాయి. పెళ్ళి కూతురును తీసుకురావడానికి ఐదు నిమిషాల ముందు పెళ్ళి కూతురి అన్నయ్య మరొక వ్యక్తితో లోపలికి వస్తూ ''వచ్చేశారా? ఒరే కుమార్ ఈయనే పెళ్ళి కొడుకు'' అని రాఘవరావు వంక చూస్తూ ''హల్లో వీడు కుమారని నా ఫ్రెండ్'' అంటూ అతన్ని పరిచయం చేయబోయాడు.

పెళ్ళికూతురి కోసం చూస్తున్న రాఘవరావు పెళ్ళి కూతురి అన్నతో వచ్చిన వ్యక్తిని చూసి బెంబేలు పడిపోయాడు. ఆ వ్యక్తి తన సొంత బావమరది. తన భార్యకు స్వయానా అన్నయ్య. ఇక రాఘవరావు పరిస్థితి ఎలా వుంటుందో ఆలోచించండి.

—బి.భార్గవి




''ఏయ్ మిస్టర్! మీ టిక్కెట్ చూపించండి.''

''జస్ట్ మినిట్. ఇప్పుడే టాయ్‌లెట్‌కి వెళ్లి వస్తాను!''

''సారీ. ఒక్కసారి చూపించండి. మళ్ళీ వెనక్కి రావడం కుదరదు.''

ఆ యువకుడు హడావుడిగా జేబులు వెదకడం మొదలెట్టాడు. ''సారీ. రన్నింగ్‌లో ఎక్కాను. కావే టైమ్ లేక టిక్కెట్ తీసుకోలేదు'' ఇబ్బందిగా మొహం పెట్టి సంజాయిషీ ఇచ్చాడు. ఆ విషయం ముందే కనిపెట్టినట్టు విజయగర్వంగా నవ్వుకున్నాడు టి.సి. ఫైన్ కట్టించుకుని మరో కంపార్ట్‌మెంటులోకి నడిచాడు.

''అమ్మా! మీ టిక్కెట్టు''

''సీజన్'' అందామె మొహం తిప్పుకుని.

''అయినా ఒక్కసారి చూపించండి'' అన్నాడు వినయంగా.

''సీజన్ అంటున్నానుగా'' అందామె విసుగ్గా.

చూపించక తప్పదన్నట్టు అక్కడే నిలబడ్డాడు. ఇక విధిలేక అన్నట్టు విసురుగా హాండ్‌బాగ్ తీసి మూడు నాలుగు అరల్లో వెదికింది. తర్వాత కంగారుగా అందులోవి అన్నీ కింద పడేసి మరోసారి గాలించింది.

''ఇవాళ ఇంకో బాగ్ తీసుకువచ్చానండి. సీజన్ నిన్నటి బాగ్‌లో వుండిపోయింది'' అందామె సగం దిగివచ్చి.

''దానికి నేనేం చేయగలనండి. ఫైన్ కట్టేయండి'' అన్నాడు టి.సి. కరుగ్గా.

''రెగ్యులర్ పాసింజర్స్‌ను కూడా ఫైన్ కట్టమంటే ఎలా?''

''ఎవరికైనా రూలు రూలేనండి. కట్టక తప్పదు'' తెగేసి చెప్పాడు. మొహం ముడుచుకుని మొత్తం కట్టేసిందామె. తర్వాత తిట్టిన తిట్టు తిట్టకుండా మొత్తం రైల్వే డిపార్ట్‌మెంట్‌నంతా కడిగి పారేస్తుంటే విజయగర్వంగా నవ్వుకుంటూ ముందుకు నడిచాడు.

''మిస్టర్! మీ టిక్కెట్ చూపిస్తారా?''

''అఫ్‌కోర్స్! యువర్ ఐడెంటిటీ ప్లీజ్''

''వాడ్డు యు మీన్?'' అన్నాడు టి.సి. కోపంగా.

''మీ ఐడెంటిటీ కార్డ్ చూపించమంటున్నాను'' అన్నాడు ఆ యువకుడు ఇంకా తాపీగా.

''దటీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్.''

''సరే, అయితే నేనూ టిక్కెట్ చూపించను.''

''మర్యాదగా చూపించండి'' అన్నాడు విసుగ్గా.

''మీరు టి.సి. అని నాకు నమ్మకమేంటి?టిక్కెట్టు లేకుండా ట్రైన్ ఎక్కి ఈ వేషం వేసి వుండొచ్చు. కాదని నిరూపించగలరా?'' లాపాయింట్ తీసాడు ఆ యువకుడు.

కోపాన్ని దిగమింగుతూ టి.సి. జేబులో చేయి పెట్టాడు- లేదు. వెనుక జేబు- ఊహూ... పక్క జేబు- అందులోనూ లేదు. నుదుటి మీద చిరు చెమటలు. పొద్దున షర్టు మార్చుతూ హడావుడిగా అందులోది తీసుకోలేదని గుర్తొచ్చింది. మొహం అవమానంతో కందగడ్డలా మారింది.

''అది ఇంకో షర్ట్‌లో వుండి పోయింది'' అన్నాడు సాధ్యమైనంత నిర్లక్ష్యంగా.

''మీ నంబరెంతో చెప్పండి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వుంటున్నారని, ఐడెంటిటీ కార్డ్ మర్చిపోయి నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనీ మీ మీద కంప్లెయింట్ ఇవ్వదలచుకున్నాను. మీరు ఐడెంటిటీ చూపించే వరకూ నేనూ టిక్కెట్టు చూపించను'' ఈసారి దబాయించడం అతని వంతయింది.

విజయగర్వం తాలూకు చిరునవ్వు మాయమయింది టి.సి. మొహం నుంచి.